# 'శివ' మెత్తక తప్పదు మరి !

"తర తరాలుగ కొలువు తీర్చిన
తారతమ్యపు కోట గోడలు
పగులగొట్టగ ప్రజాశక్తులు
పల్లవించాయి"

అని ఎప్పటికప్పుడు ఎందరో కొందరు రుజువు చేస్తూనే వున్నారు.



జనం నీతి కోసమూ ఉద్యమిస్తారు. భీతితోనూ ప్రతిఘటిస్తారు.

భవిష్యత్తు చిత్తు అవుతుందనే భయంతోనూ, ఆశల దీపం కొండెక్కకూడదనే ముందు చూపుతోనూ వాషింగ్టన్ వీధుల్లో ప్రగతిశీలకులు కదం తొక్కారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచబ్యాంకు పేద, వర్థమాన దేశాలకు అప్పులిచ్చి, తమ చెప్పుచేతల్లో ఉంచుకోవాలని చూస్తున్నాయని జనం ప్రభంజనమయ్యారు.

అమెరికా అధికార దాహంపై ఆగ్రహం ప్రకటించారు. వర్థమాన దేశాల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అంతర్జాతీయ మార్కెట్లో తాకట్టు పెట్టుకుంటున్నాయని తలపట్టుకుని వాపోకుండా తలెత్తి తమ నిరసన గళాలను వినిపించారు.

జనం ప్రభంజనమయినప్పుడు ప్రభువులు దండోపాయాన్ని ప్రయోగించడం చరిత్ర చెప్పిన సత్యం. వాషింగ్టన్ వీధుల్లో అమెరికా పోలీసులు ధర్మాగ్రహాన్ని తెలిపిన జనంపై లాఠీలను ఝళిపించారు. లాఠీదెబ్బలు తింటూనే "క్లింటన్ గో బ్యాక్, క్లింటన్ పెద్ద విలన్" అంటూ జనం దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు. పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. తమ కంట బాష్పాలు కారకుండా జనం కళ్లెర్ర చేశారు. పోలీసులు బెంబేలు పడిపోయి జనం కళ్లల్లో మిరియాల పొడి జల్లారు. అప్పుడు జనం పిడికెళ్లెత్తారు.

పెద్దన్న అమెరికా పెత్తనం ఇంకానా ఇకపై సాగదు అంటూ సాగే నిరంతర ప్రతిఘటనోద్యమం అది. విశ్వవ్యాప్తంగా వినిపించే స్వేచ్ఛా గీతం అంది.

"పాటుపడినా పొట్టనిండని/పూట గడిచే దిక్కుతోచని/జీవితాకాశాన తూరుపు/జేవురించింది" అని సామాన్యులు అసమాన అనుదిన పోరాటాలు సాగిస్తూనే ఉన్నారు.

చిన్న చిన్న జీతాలతో బరువు బతుకులు మోస్తూ దీనంగా, హీనంగా ఉన్న లక్షలాది జనం నిత్యావసర వస్తువుల ధరల్ని పెంచినందుకు తమ వ్యతిరేకత తెలిపారు. అసలే అంతంత మాత్రంగా బతుకు

కె.వి.యస్.వర్మ ఫీచర్స్

బండిని లాగుకొస్తున్న తమపై మరింత భారం మోపడం ఏ మాత్రం న్యాయం కాదని ఎర్రజెండాలు పట్టుకుని దేశమంతటా ప్రదర్శనలు చేశారు. పెంచిన ధరల్ని దించితే తప్ప తమ బతుకు బండి ఈ గతుకుల రోడ్డుపై ముందుకు ఇక సాగదని నినాదాలు చేశారు. అమెరికాకు దేశాన్ని తాకట్టు పెడుతున్న వాజపేయి అమెరికా జండాను టోపీగా పెట్టుకున్నట్టు కేరికేచర్ గీయించి, దాని పట్టుకుని ఢిల్లీ వీధుల్లో ప్రదర్శించారు.

నింగిని తాకిన ధరల్ని నేలకు దించమని తిరుపతిలో ఉద్యమకారులు గొంతెత్తి అరిస్తే పోలీసులు లాఠీలు ఎత్తారు. చితకబాదారు. మహిళల్ని కూడా పక్షపాతం లేకుండా పోలీసులు చితకకొట్టారు. ఓ యువతికి గర్భస్రావం అయ్యింది. ఓ వామపక్ష నాయకుడు లాఠీదెబ్బలకు ఎదురొడ్డి స్పృహతప్పి పడిపోయాడు.

హైదరాబాద్‌లో లాఠీ దెబ్బలు తినడంతో పాటు ఎందరో వామపక్ష కార్యకర్తలు అరెస్టయ్యారు. ఎర్రజెండాల రెపరెపలకు రక్షకభటులు వెర్రెత్తిపోయారు. విచక్షణారహితంగా జనంపై విరుచుకుపడ్డారు.

వరంగల్‌లో పోలీసుల లాఠీ దెబ్బలకు అనేకమంది తలలు పగిలాయి. ఎత్తిన పిడికిళ్లు మరింత బిగుసుకున్నాయి. బాధితుల గుండెచప్పుళ్లు పార్లమెంటులో ప్రతిధ్వనించాయి. అయినా, పెంచిన ధరల్ని దించేది లేదని మంత్రిగారు ఎలాంటి మొహమాటం లేకుండా చెప్పాడు.

విద్యుత్‌ను ప్రైవేటీకరించడానికి సంబంధించి తమ తొమ్మిది డిమాండ్లను ఆమోదించాలంటూ విద్యుత్ ఇంజనీర్లు ధర్నాలు చేస్తూనే ఉన్నారు. సమ్మెకు సమాయత్తమవుతూనేన్నారు

పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలు కొనసాగినంతకాలం పీడితుల ఉద్యమాలు కొనసాగుతూనే ఉంటాయి. నినాదాలు నింగిని తాకుతూనే ఉంటాయి. పిడికిళ్లు బిగుసుకుంటూనే ఉంటాయి.

"కుళ్ళు ఎంతో కంపు కొడుతూ
కళ్ళ ముందర తాండవిస్తే
మంత్రి అయినా మనిషిగానే
మండి పడతాడు"

అని ఒకోసారి అనుకోవాల్సి వస్తుంది. లేకపోతే దేవాదాయ మంత్రి దండు శివరామరాజు ఏలూరులో అన్ని వాస్తవాలు అలా మాట్లాడతాడా?

సింహాచలం దేవుడి భూముల్ని ఎమ్మెల్యేలూ ఇతర ప్రజా ప్రతినిధులూ కబ్జా చేశారని ఆయన నిర్మొహమాటంగా చెప్పాడు. దేవస్థానం భూముల్ని ఆక్రమించుకుని ఇళ్లు కట్టుకున్న వాళ్ల నుంచి నేటి మార్కెట్ ధర ప్రకారం వసూలు చేస్తామన్నాడు.

"పాతిక ముప్పై ఏళ్ల క్రితం ఆక్రమించుకున్నవాళ్లు కూడా ఉన్నారు కదా. వాళ్ల నుంచి వసూలు చేయడానికి సమస్యలేమీ రావా" అని ఒక విలేకరి అడిగేటప్పటికి "దేవుడి భూముల ఆక్రమణదారుల్లో మీ పత్రికలోళ్లూ ఉన్నారు" అని కోప్పడ్డాడు. దేవస్థానం భూముల్ని ఆక్రమించుకున్న వాళ్ల నుంచి సొమ్ము తిరిగి రాబడతామనీ, ఆ మేరకు మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించామనీ శివరామరాజు చెబితే, "మంత్రివర్గ సమావేశం వివరాలను చెప్పవద్దని ముఖ్యమంత్రి ఆదేశించారు కదా" అని మరో

పాత్రికేయుడు అన్నప్పుడు "మీ పైవాళ్లు చెప్పినట్టు వినకపోతే మీ ఉద్యోగాలు తీసేస్తారు. ముఖ్యమంత్రి చెప్పినట్టు మేం వినకపోతే సిఎం మా పదవులు తీసేస్తాడు. మాకంటే మీరే కాస్త నయం. ఒక పేపర్ కాకపోతే మరో పేపర్ ఉంటుంది. మాకున్నది ఒక్క పార్టీయే. అంచేత ఆయనగారు చెప్పినట్టు మేం వినక తప్పడం లేదు'' అన్నాడాయన.

ఎంత నియంతృత్వ పోకడలను చవిచూడకపోతే శివరామరాజు అంతగా శివమెత్తుతూ నోరుపారేసుకుంటాడు?

నియంతృత్వానికి కూడా ఎప్పుడో ఒకప్పుడు ఎవరో ఒకరు నిరసన తెలుపుతూనే ఉంటారు.

అవును. నిరసన గీతాలు కూడా వినిపిస్తూనే ఉంటాయి. నియంతృత్వాన్ని నిలదీస్తూనే ఉంటాయి!

21-4-2001
వార్త దినపత్రిక